
"మీ కజిన్ మారేజ్ రేపు సాయంత్ర మనుకుంటా." ఈ పరిస్థితిలో కూడా లత మామూలుగా మాట్లాడటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ని న్నీ స్థితిలో ఉంచి నే నెక్కడికీ వెళ్ళను లత !" నా గొంతు అదో రకంగా మారింది.

"నా మీద నీ కున్న ప్రేమ తెలును కానీ ఈ మారేజ్ కెళ్ళటం ఎంత ముఖ్యమో కూడా తెలును, ఇంకేమీ మాట్లాడకుండా వెంటనే బయల్దేరు. నేను చెప్పిందాన్ని గురించి ఆలోచించు. వారం తర్వాత మాత్రమే నువ్వు నాకు కనపడేది."

"ఏంటి? నువ్వు చెప్పిన విషయం. నువ్వు కుంటి దానివయ్యా వని నా ప్రేమ తగ్గుతుందా?




# నిర్ణయం

— శ్రీనివాసరావు

మరీ సిల్లీగా మాట్లాడకు.వారం రోజులు కాదు, ఎన్ని యుగాలైనా నువ్వు నా లతవే." లతని ఎలా ఒప్పించాలో అర్థం కావటం లేదు.

"ఇప్పుడు నీకు నా మీదున్న ప్రేమ అలా మాట్లాడిస్తుందని తెలుసు. కానీ ఆ ప్రేమ శాశ్వతంగా ఉండాలని కోరుకోవడం తప్పా? నా మీదున్న జాలి కూడా ని న్నీ క్షణంలో నా సమక్షంలో ఆలోచించనివ్వదు. ఇప్పుడేదో ఆవేశంతో, జాలితో నువ్వంటున్న మాటలు క్షణికం కాకూడదని నా అభిప్రాయం. నే నిప్పుడు కుంటిదాన్ని. నీకు పరిచయమైన లత వేరు, ఇప్పుడు నువ్వు పెళ్ళి చేసుకోవాలనుకుంటున్న లత వేరు."


ఎప్పుడూ నాకు హాయి నిచ్చే లత మాటలు ఇప్పుడు కోపాన్ని తెప్పిస్తున్నాయి.

"ఏమి టీ మాటలు లత? నీ మనసెంత మంచిదో నాకు తెలీదా? నా కెప్పుడూ నీ మనస్సే ముఖ్యం. అయినా నీ అందం చూసి నిన్ను ప్రేమించానా? నీ కెలా చెప్తే అర్థమవుతుంది నా బాధ?"

"వాసూ! త్వరత్వరగా ఆవేశంలో నిర్ణయాలు తీసుకొని ఆ తర్వాత జీవితాంతం బాధ పడటం నేను భరించలేను. అయినా నా కోసం ఈ ఒక్క వారమూ ఓపిక పట్టలేవూ?"

నేను లత కెదురు బెడ్ మీద కూర్చొనుండగా వారం రోజులు క్షణంలో తిరిగిపోతే బావుణ్ణనిపించింది. వారం రోజులు లతని చూడకుండా ఉండటం సాధ్యమా? లత నిర్ణయాలు ఎంత గట్టివో కూడా తెలుసు. ఇక వాదించి లాభం లేదను కొని 'సరే'నంటూ లేచాను.

"ఒక్క మాట వాసూ; నీ నిర్ణయం ఎలా ఉన్నా



మన స్నేహం కల కాలం కొనసాగాలని నా ఆకాంక్ష." బయటికి వస్తూంటే లత అన్న మాట లవి.

*** *** ***


అసలే నాకు రైలు ప్రయాణం పడదు. ఇప్పుడు నే నున్న స్థితిలో అది ఎంత దుర్భరమైందో తలచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తోంది. లత చెప్పిన విషయమై ఆలోచించటానికి ఏమిలేదు. ఏదో పిచ్చాలోచన వచ్చి అలా ప్రవర్తిస్తుంది. లతతో నా పరిచయాన్ని మననం చేసుకుంటూ [ఇంకే ఇతర పనీ ఇప్పుడు చేయలేను కాబట్టి] కాలాన్ని చంపుతాను.

నేను జాబ్‌లో చేరి రెండేళ్ళవుతోంది. ఆఫీసు, సినిమా, నవలలు, మా ఇంటి ఓనర్ ఫిలాసఫీ - ఇదే నా దిన చర్య. పెళ్ళి చేసుకోమని ఉద్యోగంలో చేరగానే అందరూఅనే మాటే. చాలా మంది సలహాలు ఇస్తున్నా ఎందుకనో నా కా దృష్టి లేదు, లతని చూసే దాకా, లతని చూడగానే ఆమె లేనిదే జీవితం లేదనిపించటానికి కారణం దేవుడు తప్ప వేరేది లేదు, ఇలాంటి విషయాల్లో హేతువాదానికి తావులేదు. మనుషులెవరూ చెయ్యలేని పని ఏదైనా జరిగిందంటే 'దేవుడు చేశాడులే' అని' అనుకోవటం కొంత ఊరట కలిగిస్తుంది. లతని

నాకు పరిచయం చేసింది దేవుడు అని నా నమ్మకం.

వాళ్ళ నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అవటం మూలానా ఈ ఊరొచ్చి, నా అదృష్టం కొద్దీ నా రూంకు ఎదురింట్లో దిగారు. కొంతమందితో ఎంత కాలం కలిసివున్నా వాళ్ళని గుర్తించటం జరగదు. కానీ కొందరితో కొన్ని క్షణాలలో యుగయుగాల బంధం ఏర్పడుతుంది. మన లోకమంతా వాళ్ళే కనిపిస్తారు గత వారం నుంచీ నా లోక మంతా లతే. లత డిగ్రీ ఫైనల్ చదువుతోంది, మామూలుగా ఉంటుంది. మా పరిచయం పెళ్ళిదాకా వచ్చింది. దేవుడు మా ప్రేమకి పరీక్ష పెట్ట దలచుకున్నాడో ఏమో [మళ్ళీ దేవుడే కారణం] నిన్న ఏక్సిడెంట్‌లో లత ఎడమకాలు దెబ్బతింది. ఫలితంగా ఆమె కుంటిదైంది. ప్రేమ మనసులకి సంబంధించింది కాని శరీరాలకి సంబంధించిందా?

ఇలా ఆలోచనల్లో ఉన్న నాకు టైం తెలీలేదు. రైలు మా ఊరు సమీపించగానే 'అరే అప్పుడే




వచ్చిందా' అనిపించింది. కాలానికి ప్రమాణం వినుగు.

*** *** ***

పెళ్ళి సందడిలో రెండ్రోజులు గడిచాయి. ఇంకా ఐదు రోజులు. ఇప్పు డో సమస్య వచ్చింది. రాత్రి భోజనాలప్పుడు మా అమ్మ ఒకమ్మాయిని చూపించి "పద్మ, మంచిపిల్ల, నీ కిష్టమైతే చెప్పు పెద్ద వాళ్ళతో మాట్లాడతాం" అంది.

వెంటనే లత గురించి చెప్దా మనుకున్నాను. [అసలెప్పుడో చెప్పి ఉండాల్సింది].కానీ ఎందుకో చెప్పలేక పోయాను. పొద్దున్నుంచీ పద్మ చాలా సార్లు కనపడింది. ముందేమీ అనిపించలేదు కానీ ఇప్పుడు లతని పద్మతో పోల్చుకో లేకుండా ఉండలేక పోతున్నాను.

పద్మ ఎంత అందంగా ఉంది! పద్మ ముందు లత ఎంత? మరీ ఆ కుంటి కాలు, కుంటి దానితో సంసారం ఎలా సాగించే టట్టు? అందరూ నన్ను ఎగతాళి చేస్తారేమో? అసలు అమ్మ నాన్న ఒప్పుకో కుండా ఈ పెళ్ళెలా జరుగుతుంది? లత కుంటిది కాకపోతే ఒప్పుకునుండే వాళ్ళేమో, ఇప్పుడు చచ్చినా ఒప్పుకోరు.

నా ఆలోచనలు నాకే అసహ్యమనిపించాయి. లత తోటి జీవితం గురించి నేను కన్న కలలు, నేను వచ్చే ముందు లతతో అన్న మాటలు అంతా వ్యర్థమని నా మనసు అంగీకరించాల్సిన అవసరం వచ్చిందేమో! ఏదీ తేల్చుకోలేక పోతున్నాను. ఆలోచించిన కొద్దీ లతకి దూరమౌతున్నా నేమో ననిపిస్తుంది.

"ఏమిటి వాసూ? ఒక్కడివే దీర్ఘా లోచనలో ఉన్నట్టున్నావు? వచ్చినప్పట్నుంచి నీతో మట్లాడటానికి వీలు పడలేదు." లక్ష్మి నా కెదురుగా కూర్చుంటూ అంది. ఆమె మాటలు నాకెంతో ప్రశాంతతని తెచ్చాయి. ఆమె గురించి చెప్పకపోతే అసలు కథే లేదు.

నేను చిన్నప్పట్నుంచీ మా కజిన్ వాళ్ళూరు వచ్చినప్పుడల్లా లక్ష్మి వాళ్ళింట్లో రెండు రోజులుండటం మామూలైంది. నా కంటే ఆమె నాలుగేళ్ళు పెద్దది. పేరు పెట్టే పిలుస్తాను. వాళ్ళ నాన్నగారు మా పెద్దనాన్నకి మంచి ఫ్రెండు. చిన్నప్పట్నుంచీ లక్ష్మి అంటే నాకు అభిమానం. స్వంత అక్కయ్యలు లేకపోవటం వల్ల ఆమె నాకు స్వంత అక్కయ్య కంటే ఎక్కువ. తనేం చెప్పినా నే నెప్పుడూ వినే వాణ్ణి. అప్పటి రోజులు గుర్తుకు వచ్చి నప్పుడల్లా 'నే నెందుకు పెద్ద వాణ్ణయ్యాను' అనిపిస్తుంది.

తర్వాత ఆమెకి పెళ్ళయినదగ్గర్నుంచీ రాకపోకలు తగ్గాయి. ఆమె భర్త కిరణ్ కాలేజీ లెక్చరర్. ఇద్దరిదీ చాలా ముచ్చటైన జంట. ఆమెని చివరిసారిగా చూసింది రెండేళ్ళ కిందట.

ఈ రెండేళ్ళ నుంచీ జరిగిన విశేషాలన్నీ పూర్తిగా మాట్లాడుకున్నాం.ఆమె ఏదీ మాట్లాడకముందే నే నింకో విషయం మాట్లాడ తాను. అసలు ఆమె ఏదీ మాట్లాడ లేదు, నేను మాట్లాడ నివ్వ లేదు. మాటల సందర్భంలో నే నిప్పుడు ఆలోచిస్తున్న విషయం కూడా చెప్పాను. రేపు వాళ్ళూరికి రమ్మనమంది. వెంటనే 'సరే' నన్నాను.

*** *** ***

వాళ్ళింట్లో దిగగానే వీల్ చెయిర్లో కిరణ్ కనిపించాడు. ఒక్క క్షణం నేను నా కళ్ళని నమ్మలేక పోయాను, ఎదురుగా రెండుకాళ్ళూ కోల్పోయిన కిరణ్‌ని చూసి. కొంచెం తేరుకొని లక్ష్మిని మనసులో తిట్టుకున్నాను ఇలాంటి దృశ్యం చూపించటానికా న న్నీ ఊరు తీసుకొచ్చింది. వెంటనే వాళ్ళ మీద జాలి కూడా కలిగింది. "నా మీద కోపం, మా మీద జాలి తర్వాత చూపించవచ్చు, ముందు స్నానం కానివ్వు" అంది లక్ష్మి.

ఆ తర్వాత ముగ్గురం వరండాలో కూర్చున్నాం. లక్ష్మి దగ్గర వాళ్ళమ్మాయి జ్యోతి, కిరణ్ దగ్గర జీవన్‌లను చూసు ఇంత చిన్న పిల్లల్తో లక్ష్మి ఎలా నెట్టుకొస్తుందో అని ఆలోచిస్తున్నాను.

ఏం మాట్లాడాలో తెలీకా మౌనంగా ఉన్నాను. లక్ష్మి కిరణ్‌తో నా సమస్య గురించి చెప్పింది. "చూడ వోయ్ వాసూ! నిదానంగా ఆలోచించి. మంచి నిర్ణయం తీసుకో. ఇటువంటి విషయాల్లో ఇతరుల మాటలు అనవసరం. రేపు ఏవైనా కష్టాలొస్తే వచ్చేది నీకు కాని వాళ్ళకు కాదు." ఖచ్చితంగా చెప్పాడు.

"వాసూ, చిన్నప్పట్నుంచీ నీ గురించి నాకు తెలును. నీలో ఆలోచించగల శక్తి ఉంది. తొందరపడి ఏ నిర్ణయం తీసుకుంటావో అని ఇక్కడికి తీసుకు వచ్చాను. ఐదు రోజులూ మాతో ఉండి ఆలోచించుకో, నీ స్వంత నిర్ణయమే నీకు ముఖ్యం, నీ సమస్య నీది."

లక్ష్మి కూడా అలా అనేసరికి నే నేం మాట్లాడాలో అర్థం కాలేదు.

ఆ టాపిక్ అక్కడే వదిలేసి మిగతా విషయాలు మాట్లాడుకున్నాం. వాళ్ళ సమక్షంలో నాకు చాలా హాయిగా ఉంది.

ఐదు రోజులు ఒక్కక్షణంలో గడిచి పోయినట్లుగా ఉంది. వాళ్ళు అన్ని పనులు మామూలుగా చేస్తుంటే నాకు చాలా ఆశ్చర్యమేసింది. 'కాళ్ళు లేవు' అనే విషయం వాళ్ళు మరిచిపోయి మామూలుగా ఉండటం నా కర్థం కాలేదు. లక్ష్మి మామూలుగానే కాలేజీకి వెళ్తోంది. కిరణ్ సాయంత్రం దాకా వాళ్ళ పొలాల విషయం చూడటం, సాయంత్రం స్టూడెంట్స్‌కి ట్యూషన్ చెప్పటం - ఇలా వాళ్ళ ప్రతి విషయం నాకు ఆశ్చర్యంగానే ఉంది.కొన్ని సార్లు వాళ్ళనే డైరెక్టగా అడిగే వాణ్ణి.

నిదానంగా నా సమస్యకి పరిష్కారం దొరికింది. వాళ్ళు నా మీద చూపిన ప్రభావం, నేను బయల్దేరే ముందు లక్ష్మి అన్న మాటలు నాకు జీవితాంతం గుర్తుంటాయి.

"చూడు వాసూ, కిరణ్‌కి ఏక్సిడెంట్‌యి దాదాపు సంవత్సరమవుతూంది. మొదటి మూడు నెలలు మే మనుభవించిన నరకం ఆ దేవుడికి తెలుసు. నా కైతే చచ్చిపోదామనిపించింది. మే మిద్దరమూ మాట్లాడుకోవాలంటే భయపడేవాళ్ళం.దానికి తోడు లోకుల మాటలు, కానీ నిదానంగా ఆలోచిస్తే తెలిసింది, మే మేమీ పోగొట్టు కోలేదనీ, జ్యోతి, జీవన్‌లు మా ప్రాణమనీ. ఒక విధంగా చెప్పాలంటే ఏక్సిడెంట్ తర్వాత మా ప్రేమ రెట్టింపయింది. నీ దగ్గరున్న చనువు కొద్దీ ని న్నో మాట అడుగుతాను. పెళ్ళయిన తర్వాత లత కుంటిదైతే ఆ అమ్మాయిని వదిలేస్తావా?"

నేను వచ్చే ముందు ఆవేశంలో లతతో అన్నమాటలు ఇప్పుడు మనసా, వాచా, కర్మణా పాటిస్తాను, నమ్ముతాను. □